



# కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 74

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శుక్రవారం 25 జూలై 2025


## అమరావతి క్వాంటం వ్యాలీ ఏర్పాటులో క్యూపిఐఏఐ భాగస్వామ్యం

**ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆ సంస్థ వ్యవస్థాపకులు నాగేంద్ర నాగరాజన్ భేటీ**





**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమారవతి క్వాంటం వాలీ లో క్యూపిఐఏఐ భాగస్వామ్యం కానుంది. నేషనల్ క్వాంటం మిషన్‌లో భాగంగా దేశంలోనే తొలిసారిగా అమరావతిలో ఏర్పాటు చేస్తున్న క్వాంటం వ్యాలీలో క్యూపీఐఏఐ కూడా భాగస్వామ్యం వహించనుంది. దీనిలో అధునాతన 8 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటుకు క్యూపిఐఏఐ సంస్థ ముందుకు వచ్చింది. ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ సంస్థ వ్యవస్థాపకులు నాగేంద్ర నాగరాజన్‌తో చర్చించారు. ప్రజల ప్రయోజనాల కోసం ఉపకరించే ఆవిష్కరణలు, అలాగే, విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడేలా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సిఎం అన్నారు. దీనితో పాటు అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి క్యూపిఐఏఐను కోరారు. తద్వారా విద్యార్థులు, పరిశోధకులు, స్టార్టప్‌లు క్వాంటం అల్గారిథంలు, అప్లికేషన్‌లను రూపొందించుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు.

**వివిధ రంగాల్లో క్వాంటం కంప్యూటింగ్ సేవలు..** రాష్ట్రంలో వివిధ పంటల సాగులో కచ్చితత్వం, తెగుళ్లకు సంబంధించిన అంశాలను అంచనా వేసేందుకు క్వాంటం కంప్యూటింగ్ ఉపకరించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అదే సమయంలో వ్యవసాయ ఉత్పత్తి పెరిగేలా సూచనలు, సలహాలను సకాలంలో ఇవ్వటం ద్వారా రైతుల ఆదాయాలను మెరుగుపడేందుకు ఈ సాంకేతికత దోహద పడాలని సీఎం పేర్కొన్నారు.

రాష్ట్రంలో నీటి వనరులను సమర్థంగా నిర్వహించేందుకు వీలుగా క్వాంటం టెక్నాలజీని వాడాలన్నారు. వ్యాధుల నిర్ధారణ, మెడికల్ లాజిస్టిక్స్ తదితర అంశాల్లోనూ క్వాంటం సిమ్యులేషన్‌ను సమర్థంగా వినియోగించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. యువతకు నైపుణ్యాలను కల్పించే అంశంలోనూ క్వాంటం టెక్నాలజీ సహకారాన్ని తీసుకునేలా ప్రభుత్వం యోచన చేస్తోంది. క్వాంటం లాంటి ఆధునిక సాంకేతికత ద్వారా సామాన్య ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితుల్ని మెరుగు పర్చేలా ప్రభుత్వం కార్యాచరణ చేస్తోంది. విద్య, పరిశోధన, ఇన్నోవేషన్ రంగాల్లో డీప్ టెక్ ద్వారా సమాజానికి విస్తృత ప్రయోజనాలు కల్పించటమే లక్ష్యంగా క్యూపిఐఏఐ, నేషనల్ క్వాంటం మిషన్, అమరావతి క్వాంటం వ్యాలీ పనిచేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

## వ్యవసాయ అనుబంధ రంగాలలో 8.8 శాతం వార్షిక వృద్ధి రేటు సాదించడంలో ఆంధ్రప్రదేశ్ ది ప్రధమ స్థానం - రాష్ట్ర గవర్నర్

- ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్టులో ఘనంగా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ 57వ స్నాతకోత్సవ కార్యక్రమం
- విద్యార్థులకు డిగ్రీలు, అవార్డులు అందించిన రాష్ట్ర గవర్నరు, విశ్వవిద్యాలయ కులపతి ఎస్ అబ్దుల్ నజీర్..









**ఆత్కూరు(ఉంగుటూరు),కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ 2024-25వ సంవత్సరంలో వ్యవసాయ అనుబంధ రంగాలలో 8.8 శాతం వార్షిక వృద్ధి రేటు సాదించడంలో ప్రధమ స్థానంలో వుందని రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. గన్నవరం నియోజకవర్గం, ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలోని స్వర్ణ భారత్ ట్రస్టు ప్రజా మందిరంలో గురువారం గుంటూరు జిల్లా, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ 57వ స్నాతకోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నరు, విశ్వవిద్యాలయ కులపతి ఎస్ అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహించి డిగ్రీలు పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందించారు. ఈ కార్యక్రమానికి పంజాబ్ రాష్ట్ర ఎన్ఆర్ఐ కమిషన్ సభ్యుడు, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఏ వేణు ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి స్నాతకోపన్యాసం చేశారు. కార్యక్రమంలో ముందుగా రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి అనుమతితో ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మీ దేవి స్నాతకోత్సవ ప్రొసీడింగ్స్ ను ప్రారంభించారు. ఈ క్రమంలో ఆమె విశ్వవిద్యాలయం ఏర్పాటు, పుట్టుపూర్వోత్తరాలు, అందిస్తున్న కోర్సులు, సాధించిన విజయాలు వివరించారు. స్నాతకోత్సవంలో 46 మందికి డాక్టరేట్ లు, 196 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు, 1,420 మంది గ్రాడ్యుయేట్లకు వివిధ పతకాలు మెరిట్ సర్టిఫికెట్లు అందించి అభినందించారు. అదేవిధంగా వ్యవసాయ శాస్త్రంలో అత్యుత్తమ పరిశోధనలకు గాను

- 3లో

## 26 నుంచి సిఎం చంద్రబాబు సింగపూర్ పర్యటన

- పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ప్రముఖ సంస్థల ప్రతినిధులతో భేటీలు
- బ్రాండ్ ఎపి ప్రమోషన్‌తో పరిశ్రమలు తెచ్చేందుకు 6 రోజుల పర్యటన



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్ లో పర్యటించనున్నారు. ఈ నెల 26 నుంచి 31 తేదీ వరకు 6 రోజుల పాటు ఆయన ఆ దేశంలో పర్యటించి దిగ్గజ సంస్థల ప్రతినిధులు, యాజమాన్యాలు, ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలతో భేటీ కానున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత దావోస్ పర్యటనకు వెళ్లిన సిఎం...రెండో విదేశీ పర్యటనగా సింగపూర్ కు వెళుతున్నారు. బ్రాండ్ ఎపి ప్రమోషన్ తో రాష్ట్రానికి పెట్టుబడులను సాధించేందుకు ఈ పర్యటనను వేదిక చేసుకోనున్నారు. ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన పారిశ్రామిక పాలసీలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజెనెస్ విధానాలను వివరించి పెట్టుబడుదారులను ఆహ్వానించనున్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవేలు, హార్బర్లు, భూముల లభ్యత, కనెక్టివిటీ, 1053 కి.మీ తీర ప్రాంతం, నిపుణులైన మానవ వనరులు గురించి వివరించనున్నారు. అలాగే పారిశ్రామిక వేత్తలను పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరనున్నారు. 6 రోజుల పర్యటనలో సీఈఓలు, కంపెనీల ప్రతినిధులతో భేటీ కానున్నారు. మొదటి రోజు సింగపూర్ సహా సమీప దేశాల్లో నివసిస్తున్న ప్రవాసాంధ్రుల సంఘం నిర్వహించే 'తెలుగు డయాస్పోరా' సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. ఎపిలో పెట్టుబడులపై ఆయా దేశాల వారిని ఆహ్వానించనున్నారు. పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సిఎం పారిశ్రామిక వేత్తలను కోరనున్నారు.

**విశాఖ పెట్టుబడుల సదస్సు లక్ష్యంగా...** ఏపీలో పోర్టు ఆధారిత ప్రాజెక్టులు, సెమి కండక్టర్లు, ఏఐ, డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన పెట్టుబడులపై ముఖ్యమంత్రి చర్చించనున్నారు. ఈ ఏడాది నవంబరులో విశాఖలో నిర్వహించే పెట్టుబడుల సదస్సుకు సింగపూర్ పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించేందుకు గానూ ఆ దేశానికి చెందిన ప్రముఖులతోనూ ముఖ్యమంత్రి భేటీ కానున్నారు. డిజిటల్ ఎకానమీ, ఫిన్‌టెక్‌పై నిర్వహించే బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశాల్లో కూడా ముఖ్యమంత్రి పాల్గొంటారు. అలాగే సింగపూర్‌లో నిర్వహించే బిజినెస్ రోడ్ షోకు హాజరవుతారు. ఆ దేశంలోని వివిధ మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ కేంద్రాలను కూడా సీఎం సందర్శించనున్నారు.







# మంచి నడవడికతో పోలీసుశాఖ ప్రతిష్టను పెంచాలి - జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



**విజయనగరం,కలంకౌంటర్ :** అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో శిక్షణ తదుపరి (గ్రేహౌండ్స్) విభాగంలో కమాండో శిక్షణ పూర్తి చేసుకొని, జిల్లాకు కేటాయించిన నలుగురు ప్రొబేషనరీ సబ్ ఇన్స్పెక్టర్లు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - మంచి నడవడికతో పోలీసుశాఖ ప్రతిష్టను మరింత పెంచాలన్నారు. జిల్లాకు రిపోర్టు చేసిన ఎస్ఐలు బి.సాయిరాం పడాల్, పి.నాని, కే.సాయిరాం, కే.దుర్గా ప్రసాద్ లతో జిల్లా ఎస్పీ మమేకమై, వారు ఏమి చదువుకున్నది, శిక్షణ ఏవిధంగా సాగినది, శిక్షణలో నేర్చుకున్న అంశాలు గురించి అడిగి తెలుసుకున్నారు. శిక్షణలో ఎక్కువగా సాంకేతిక అంశాలు గురించి అవగాహన పొందినందున, సాంకేతికతను వినియోగించుకొని, ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలన్నారు. ప్రజలు పోలీసుశాఖపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము కానివ్వకుండా, నీతి, నిజాయితీ, క్రమశిక్షణ, సేవాతత్పరితతో పని చేయాలన్నారు. పోలీసు స్టేషనుకు వచ్చే బాధితులకు న్యాయం చేయాలని, విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, నిందితులు శిక్షింపబడే విధంగా కేసుల దర్యాప్తులో సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. ప్రాక్టికల్ శిక్షణ కోసం నలుగురు ప్రొబేషనరీ ఎస్ఐలను నాలుగు పోలీసు స్టేషన్లుకు కేటాయిస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన విధులపై అవగాహన పొందేందుకు, శాంతిభద్రతల పరిరక్షణ, నేర పరిశోధన, వివిధ రకాలైన పోలీసు స్టేషను రికార్డులు, దర్యాప్తు మెళుకవులను తెలుసుకోవాలని ప్రొబేషనరీ ఎస్ఐలకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ దిశా నిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. ఎన్.గోపాల నాయుడు, ప్రొబేషనరీ ఎస్ఐలు బి.సాయిరాం పడాల్, పి.నాని, కే.సాయిరాం, కే.దుర్గా ప్రసాద్ లు పాల్గొన్నారు.

# బాలికా సదన్ నిర్వహణ లోపంపై ఎమ్మెల్యే ఆగ్రహం.. ఆకస్మికంగా తనిఖీ...

- పిల్లలు ఏ సమస్య ఉన్న తనను సంప్రదించవచ్చు.... కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు





**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు పట్టణంలోని మార్కండేయ స్వామి గుడి వెనుక వైపు ఉన్న బాలికా సదన్ ను స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సదన్ లో ఉన్న చిన్న చిన్న బాలికలు తమ బట్టలను స్వయంగా ఉతుక్కోవడం, అలాగే పరిసరాలు మురికి చెత్తతో నిండి ఉండడాన్ని చూసి ఇంచార్జ్ వార్డెన్ పై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీ సందర్భంగా బాలికలతో మాట్లాడిన ఎమ్మెల్యే మీకు ఏ సమస్య ఉన్నా నాకు తెలియజేయాలని చెప్పారు.. పిల్లలకి అందుతున్న వసతులు, భోజన ప్రమాణాలు, పరిశుభ్రత వంటి అంశాలపై వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు బాలిక సదన్ కు సంబంధించిన రికార్డులను ను ఎమ్మెల్యే పరిశీలించారు.. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంకోసారి ఇక్కడ ఇలాంటి వాతావరణం పునరావృతం కాకుండా చూసుకోవాలని, ఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇంత చిన్న వయస్సులో బాలికలే బట్టలు స్వయంగా ఉతుక్కోవటం పై కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే గారు తెలిపారు వార్డెన్ తో పాటు సంబంధిత సిబ్బందిపై సీరియస్ గా స్పందించిన ఆయన, విధులను సక్రమంగా నిర్వహించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# 120కిలోల గంజాయితో 8మంది నిందితులు అరెస్టు - జిల్లా ఎస్పీ వకుల్ జిందల్











**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం జిల్లా భోగాపురం మండలం రాజాపులోవ వద్ద భోగాపురం పోలీసులు మరియు ఈగల్ పోలీసులకు వచ్చిన ఖచ్చితమైన సమాచారం మేరకు విజయనగరం నుండి మూడు కార్లలో వస్తున్న 8మంది వ్యక్తులను అదుపు లోకి తీసుకొని, వారి వద్ద నుండి 47 ప్యాకెట్లలోగల 120కిలోల గంజాయిని, తొమ్మిది సెల్ ఫోన్లును సీజ్ చేసినట్లుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ భోగాపురం పోలీసులకు వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో రాజాపులోవ జంక్షను వద్ద వాహన తనిఖీలు చేపట్టగా, విజయనగరం నుండి మూడు కార్లలో వస్తున్న ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి 47 ప్యాకెట్లులోగల 120కిలోల గంజాయి, 9 సెల్ ఫోన్లు, ఒడి 05 హెచ్ 8352 నంబరుగల ఆల్టో కారు, ఓఆర్ 15ఎం 7782 నంబరు గల సాంత్రో కారు, యుపి 24 బిఎల్ 0902 నంబరు గల షిఫ్ట్ కారును సీజ్ చేసామన్నారు. పట్టుబడిన నిందితుల్లో (ఎ-1) ఒడిస్సా రాష్ట్రం కోరాపుట్ జిల్లా లంతాపూర్ బ్లాక్ బల్లేల్ గ్రామానికి చెందిన కొర్రా కిరణ్ (21 సం.లు) (ఎ-2) ఒడిస్సా రాష్ట్రం కోరాపుట్ జిల్లా లంతాపూర్ బ్లాక్ బల్లేల్ గ్రామానికి చెందిన మనోజ్ బిసాయ్ (20 సం.లు) (ఎ-3) ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం హాపూర్ జిల్లా లక్ష్మణపుర గ్రామానికి చెందిన బిజేంద్ర (46 సం.లు) (ఎ-4) ఢిల్లీకి చెందిన పాత సీంపూర్ ప్రాంతానికి చెందిన పాజిల్ (30 సం.లు) (ఎ-5) ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం బుదాన్ జిల్లా సక్రి జంగిల్ గ్రామానికి చెందిన ముఖ్తర్ అహ్మద్ (43 సం.లు) (ఎ-6) ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం బుదాన్ జిల్లా అహిర్వారా గ్రామానికి చెందిన రామ్మోహన్ (21 సం.లు) (ఎ-7) ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం కాశగాని జిల్లా కుల్లి గ్రామానికి చెందిన సోను (34 సం.లు) (ఎ-8) ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాశగాని జిల్లా కుల్లి గ్రామానికి చెందిన శిల్పి (30 సం.లు) గా విచారణలో గుర్తించామన్నారు. నిందితులు గంజాయిని ఉత్తర ప్రదేశ్, ఢిల్లీలకు రవాణ చేయాలనే ఉద్ధేశ్యంతో ఒడిస్సా రాష్ట్రంకు చెందిన గంజాయి వ్యాపారులతో సంబధాలున్నాయన్నారు. (ఎ-9) అజిత దడక అలియాస్ ఒజి అలియాస్ మహేష్ దడక అనే నిందితుడు పరారయ్యారని, అతడిని త్వరలో పట్టుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన నిందితులకుఒడిస్సాలో గంజాయి వ్యాపారులతో ఉన్న పరిచయాలతో గంజాయిని ఒడిస్సాలో కొనుగోలు చేసి, ట్రెయిన్, కార్లలో ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు తరలించేందుకు ప్రణాళిక రూపొందించుకున్నట్లుగా తెలిపారు. ఈ క్రమంలో గంజాయిని కార్లలో విజయనగరం మీదుగా విశాఖపట్నం తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, వీరిపై ఫైనాన్సియల్ ఇన్విస్టిగేషను, పిట్ ఎన్.డి.పి.ఎస్. చట్టం ప్రకారం దర్యాప్తు చేస్తామని, పిడి యాక్టు కూడా ప్రయోగిస్తామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ కేసులో నిందితులను అరెస్టు చేసి, గంజాయిని సీజ్ చేయుటలో క్రియాశీలకంగా పని చేసిన భోగాపురం సీఐ కే.దుర్గా ప్రసాద్, ఈగల్ సిఐ డా. టెంక కళ్యాణి, ఎస్ఐ పి.పాపారావు మరియు ఇతర పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేసారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, భోగాపురం సిఐ కే.దుర్గా ప్రసాద్, ఈగల్ సిఐ టి.కళ్యాణీ, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



**గుంటూరు నగరంలో శ్రీ వామనాశ్రమ మహా స్వామీజీని కలిసి ఆశీస్సులు తీసుకున్న ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ తదితరులు**

-గుంటూరు,కలంకౌంటర్ :

# వ్యవసాయ అనుబంధ రంగాలలో 8.8 శాతం వార్షిక వృద్ధి రేటు సాధించడంలో ఆంధ్రప్రదేశ్ ది ప్రధమ స్థానం - రాష్ట్ర గవర్నర్

(మొదటి పేజీ తరువాయి)

డాక్టర్ ఎం.వి. రెడ్డి జాతీయ అవార్డు%-%2024ను డాక్టర్ ప్రశాంత కె. దాష్, ఎ.డి.జి.-కమర్షియల్ క్రాప్స్ , ఐ సి ఏ ఆర్, న్యూఢిల్లీ, వి. రామచంద్రరావు జాతీయ పురస్కారం-2024 ను డాక్టర్ పి.వి.సత్యనారాయణ, పరిశోధన సంచాలకులు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారికి ప్రధానం చేసారు. ఇదే క్రమంలో పలువురు ప్రొఫెసర్లు, సైంటిస్టులకు మెరిటోరియస్ టీచర్ అవార్డ్స్, మెరిటోరియస్ రీసెర్చ్ సైంటిస్ట్ అవార్డ్స్, మెరిటోరియస్ ఎక్స్టెన్షన్ సైంటిస్ట్ అవార్డ్స్, యంగ్ సైంటిస్ట్ అవార్డ్స్ అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నరు మాట్లాడుతూ 2050 నాటికి దేశ జనాభా 1.6 బిలియన్లు పెరిగే అవకాశం ఉంటుండగా దీని ప్రభావం వలన ఆహార ఉత్పత్తి డిమాండ్ 400 మిలియన్ టన్నులకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ డిమాండ్‌ను తీర్చడానికి ఇంకా ఎక్కువ మొత్తంలో ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయాల్సిన అవసరం వుందన్నారు. 2024లో వ్యవసాయ రంగం దేశ జిడిపికి సుమారు 16 శాతం వం-కు దోహదపడిందని, ఈ రంగం దేశ జనాభాలో దాదాపు 46.1 శాతం మందికి జీవనోపాధిని కూడా కల్పిస్తుందని పేర్కొన్నారు. ఆర్థిక సర్వే 2025 ప్రకారము, ఈ రంగం 2025వ సంవత్సరంలో దాదాపు 3.8 శాతం వృద్ధి రేటును సాదించిందని, అయితే, కనీస అవసరాలైన ఆహారం, దాణా పశుగ్రాసం డిమాండ్‌ను తీర్చడానికి మాత్రమే కాకుండా, పేదరిక నిర్మోలనకు, దేశం మొత్తం ఆర్థిక వృద్ధికి మద్దతు ఇవ్వడానికి, దేశ జిడిపిలో 8-9 శాతం వృద్ధిని కొనసాగించడానికి సంవత్సరానికి 4 శాతం వ్యవసాయ వృద్ధి రేటు అవసరం అన్నారు. ఆంధ్రప్రదేశ్ 2024-25వ సంవత్సరంలో వ్యవసాయ అనుబంధ రంగాలలో 8.8 శాతం వార్షిక వృద్ధి రేటు సాదించడంలో ప్రధమ స్థానంలో వుందని తెలిపారు. ఈ సందర్భంగా, రాష్ట్ర వార్షిక వ్యవసాయ వృద్ధి రేటులో ఇంత గొప్ప పురోగతికి కారణమైన వారందరికి అభినందనలు తెలియజేశారు. ఎక్కువ ఆహారాన్ని ఉత్పత్తి చేస్తున్నప్పుడు, పోషకాహార భద్రతను కూడా జాగ్రత్తగా చూసుకోవడం అవసరం ఉందని, దీనికనుగుణంగా, భారతదేశం తృణధాన్యాలు, చిరు ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించిందని చెప్పవచ్చున్నారు. అంతేకాకుండా, పోషకాహారలోప సమస్యలను నివారించడానికి పప్పుధాన్యాల ఉత్పత్తిపై ఎక్కువ దృష్టి పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్రంలోనే కాకుండా దేశంలోని రైతాంగానికి 60 సంవత్సరాల నిబద్ధతతో కూడిన సేవలను అందిస్తోందని, అసాధారణ వ్యవసాయ ప్రతిభను పెంపొందించడంలో సుదీర్ఘమైన, విశిష్టమైన చరిత్రను కలిగి ఉందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు జాతీయంగా అత్యధిక సంఖ్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్‌లను పొందడం, ఐ.సి.ఎ.ఆర్ వారి ఎ.ఐ.ఇ.ఇ.ఎ. పరీక్షలలో విజయం సాధించడం ద్వారా విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడంలో ఎంతో గర్వంగా ఉందన్నారు. విశ్వవిద్యాలయ నిరంతర కృషి ఫలితంగా 2023-24లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో 25 మెరుగైన పంట రకాలను విడుదల చేయడం జరిగిందని, దీని ద్వార విశ్వవిద్యాలయం రైతులకు ఆదాయం పెంపొందించే దిశలో ముఖ్యంగా వరిలో నాణ్యమైన దిగుబడులను సాదించినదని అనటంలో సందేహం లేదన్నారు. విశ్వవిద్యాలయం వివిధ పంటలలో 10,215 క్వింటాళ్ల బ్రీడర్ విత్తనాలు, 17,240 క్వింటాళ్ల ఫౌండేషన్ ధృవీకరణ విత్తనాలను ఉత్పత్తి చేయడమే కాకుండా, వాటిని బహుళ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, రైతులకు విత్తనాన్ని పంపిణీ చేయడంలో ఎంతగానో కృషి చేసిందని అభినందించారు. అదేవిధంగా విశ్వవిద్యాలయ కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాలు, క్షేత్ర పరిశీలనలు, రోగనిర్ధారణ సర్వేల ద్వారా అధిక ఉత్పాదకతను, ఆహార భద్రతను సాధించడానికి వ్యవసాయంలో సాంకేతిక సాధికారత అత్యంత ప్రాముఖ్యతను విస్తరణ కార్యకలాపాల ద్వార చాటి చెబుతున్నాయని, విజ్ఞానాన్ని ఆచరణలోనికి తీసుకురావడంలో విశ్వవిద్యాలయం ముందంజలో ఉందని పేర్కొన్నారు. భారత హరిత విప్లవ పితామహుడు, భారతరత్న డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ చెప్పినట్లుగా, వ్యవసాయం తప్పు దారి పడితే, మరేదీ సరైన దారిలో వెళ్ళే అవకాశం ఉండదని పేర్కొంటూ, దీనికి అనుగుణంగా రసాయనాదారిత వ్యవసాయ దుష్ప్రభావాలను గ్రహించి, నేటి వ్యవసాయం అధిక దిగుబడి, ఒత్తిళ్లను తట్టుకునే జన్యుపరంగా రూపొందించిన పంటలు, భిన్న వాతావరణాన్ని తట్టుకునే సాంకేతికతలు, పర్యావరణనుకూల సాంకేతికతల వైపు కదులుతోందని అన్నారు. భారతదేశ వ్యవసాయ నిజమైన బలం చిన్న రైతులలోనే ఉందన్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాటలను నొక్కి చెబుతూ, ఉత్పత్తి ధరల ముందస్తు అంచనాలకు సంబంధించిన మార్కెట్ ఇంటెలిజెన్స్‌పై ప్రయత్నాలను ముమ్మరం చేయాలని, తద్వారా రైతులు మార్కెట్ డిమాండ్ ను బట్టి సరైన పంటలను ఎంపిక చేసుకొని సాగుచేసి మెరుగైన ధరలను పొందగలమన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కొత్త ప్రపంచంలోకి అడుగుపెడుతున్నప్పుడు, మీ విద్య కేవలం ప్రారంభం మాత్రమే అని గుర్తుంచుకోవాలని, సవాళ్లను స్వీకరించడం, సరిహద్దులను దాటడం, నేర్చుకోవడం ఎప్పుడూ ఆపవద్దని ప్రోత్సహించారు. స్నాతకోత్సవంలో సర్టిఫికెట్లు అందుకున్న డాక్టరేట్ లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, గ్రాడ్యుయేట్లు, అదేవిధంగా వివిధ పతకాలు, మెరిట్ సర్టిఫికెట్లు పొందిన వారందరికీ ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. ముఖ్య అతిథి పంజాబ్ రాష్ట్ర ఎన్ఆర్ఐ కమిషన్ సభ్యుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఏ వేణు ప్రసాద్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీలు పొందిన విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ, బాపట్ల వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థిగా తను అభ్యసించిన విద్య ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి, అత్యున్నత సామాజిక సేవకు ఎంతగానో దోహదపడిందన్నారు. ఇంతటి ఉన్నతమైన విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించడం, ఎంతో విజ్ఞానాన్ని సముపార్జించడం విద్యార్థుల అదృష్టంగా ఆయన అభివర్ణించారు. విశ్వవిద్యాలయం దేశంలోనే ఉన్నతమైన ఐఐటీలతో పోటీపడి వాటికి దీటుగా సత్ఫలితాలు ఇస్తుందని అన్నారు. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాలను ఎన్నుకొని ఆయా రంగాలలో ఉన్నత ప్రతిభను చాటి చెప్పేలా కృషి చేయవలసిందిగా దిశా నిర్దేశం చేశారు. ఈ విశ్వవిద్యాలయంలో అభ్యసించిన విద్య ద్వారా తను ఎంతో మానసిక ధైర్యాన్ని, విజ్ఞానాన్ని, నైపుణ్యాలను పొందగలిగానని అన్నారు. భారత దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నపూర్ణగా నిలిచి ఎన్నో కోట్ల మంది ఆకలిని తీర్చడాన్ని గర్వించదగిన అంశమన్నారు. ఈ ప్రయాణంలో ఆహార ఉత్పత్తి గణనీయంగా పెంచడంలో విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించిందని పేర్కొంటూ, నేడు భారతదేశ వ్యవసాయంలో ఉత్పత్తి స్తబ్దత, పెరుగుతున్న సాగు ఖర్చులు, తరుగుతున్న నికర ఆదాయము, మారుతున్న వాతావరణ పరిస్థితులు, నిస్సారమైన భూములు వంటి అనేక సమస్యలు గమనిస్తున్నామని, ఈ సమస్యలను గమనించి సుస్థిరత సాధించడానికి సాగులో వైవిధ్యత ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడం సేంద్రియ వ్యవసాయం వనరుల సంరక్షించే సాంకేతికతను ఆచరించడం బలోపేతం చేయడం వంటి అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు విశిష్టమైన వ్యక్తిత్వాన్ని అలవర్చుకొని నైపుణ్యాన్ని మెరుగుపరుచుకొని తమ రంగాలలో అత్యున్నత ప్రతిభ కనబరుస్తూ సర్వతో ముఖావృద్ధి సాధించాలని సూచించారు. తొలుత కార్యక్రమానికి లేడీ గవర్నర్ సమీరా అబ్దుల్ నజీర్ తో కలిసి విచ్చేసిన రాష్ట్ర గవర్నరు, విశ్వవిద్యాలయ కులపతికి వ్యవసాయ శాఖ కమిషనరు ఎస్ డిల్లీరావు, జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు, ఉప కులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మీ దేవి, కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు కామినేని శ్రీనివాసరావు ఘన స్వాగతం పలికారు. స్వర్ణ భారత్ ట్రస్టు ప్రజా మందిరం వెలుపల పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన ప్రజా మందిరంలో బోర్డు సభ్యులు, అకడమిక్ కౌన్సిల్ సభ్యులతో గ్రూప్ ఫోటో దిగారు. తదుపరి ఆయనను ప్రత్యేక పోలీసు బ్యాండ్ మేళంతో వేదిక వద్దకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నరు కార్యదర్శి డాక్టర్ ఎం హరి జవహర్ లాల్, గవర్నర్ ఎడిసి మేజర్ అమన్ దీప్ సింగ్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జి రామచంద్రరావు, ఇతర ప్రొఫెసర్లు, గుడివాడ ఆర్డిఓ జి బాలసుబ్రమణ్యం, కార్యక్రమ నోడల్ అధికారి షేక్ షాహిద్ బాబు, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సుపరిపాలన సీఎం చంద్రబాబుకే సాధ్యం - ఎమ్మెల్యే ఇంటూరి

**-13 లక్షల రూపాయల తో సీసీ డ్రైన్ పనులకు శంకుస్థాపన.**





**కందుకూరు,కలంకౌంటర్ :** రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించగల ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు పట్టణంలో 6వ వార్డు మక్కా మసీదు వద్ద జరిగిన సుపరిపాలన తొలి ఏడాది కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కందుకూరు శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.రాష్ట్ర ప్రగతి ప్రదాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాది లోనే చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని వార్డులో ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. పట్టణంలోని మక్కా మసీదు వద్ద 15వ ఆర్థిక సంఘం నిధులతో నూతనంగా నిర్మిస్తున్న 13 లక్షల రూపాయల సి.సి డ్రైన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు..పట్టణంలో రోడ్ల వెడల్పు డివైడర్ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, పట్టణాన్ని అత్యంత సుందరీకరణంగా తయారు చేయటానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా గతంలో స్కూలుకు వెళుతున్నప్పుడు దొరికిన బంగారాన్ని పోలీస్ స్టేషన్ లో అప్పజెప్పి బాధితులకు అందేలా సహాయం చేసిన 6వ వార్డుకు చెందిన విద్యార్థి సోహెల్ ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే అనూష, మున్సిపల్ డి ఈ గణపతి, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు షేక్ నాయబ్ రసూల్ వార్డు నాయకులు షేక్ మున్నా, షేక్ ఫిరోజ్, సయ్యద్ అహ్మద్ బాషా, పార్టీ నాయకులు కంద్రా మాల్యాద్రి, చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, ముచ్చు శ్రీనివాసరావు, వడ్డేళ్ళ రవిచంద్ర, షేక్ రూబీ, ఖాదర్ బాషా జియావుద్దీన్ నజీర్, కరిముల్లా, రావూరి రామకోటయ్య, గడ్డం మాలకొండయ్య, ముచ్చు వేణు, చుండూరి శ్రీను, మేడ మల్లికార్జున, అత్తంటి శ్రీహరి నాయుడు, కల్లూరి శైలజ, ఏస్తేరమ్మ, కంసాని మయూరి ద్రాక్షాయని, రసూల్ బి ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు..

# శక్తి యాప్ పట్ల ప్రతీ విద్యార్థి అవగాహన కలిగి ఉండాలి

**- మహిళా పీఎస్ డీఎస్పీ ఆర్.గోవిందరావు**





**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం పట్టణం కంటోన్మెంట్ మున్సిపల్ హై స్కూల్ మహిళ పోలీసులు, వన్ స్టాప్ సెంటర్ అధికారులు విద్యార్థులకు శక్తి యాప్ పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆర్.గోవిందరావు మాట్లాడుతూ - విద్యార్థులు మంచి లక్ష్యాన్ని ఏర్పరచుకొని, లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థి దశలో చదువుపై దృష్టి పెట్టాలని, సోషల్ మీడియా ప్రభావానికి గురి కావద్దన్నారు. ప్రతి విద్యార్థి శక్తి యాప్ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆపద సమయంలో శక్తి ఎస్.ఓ.ఎస్. కాల్ ను ఉపయోగించి పోలీసుల సహాయం ఏవిధంగా పొందవచ్చునో వివరించారు. గుర్తు తెలియని వ్యక్తుల ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రయాణించవలసి వచ్చినపుడు యాప్ లోని సేఫ్ ట్రావెల్ ఆప్షన్ వినియోగించి సురక్షితంగా గమ్య స్థానం చేరుకోవచ్చునని డీఎస్పీ విద్యార్థులకు వివరించారు. మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే పోక్సో చట్టం ప్రకారం శిక్షలు తప్పవని డీఎస్పీ ఆర్.గోవిందరావు విద్యార్థులకు రక్షణ కల్పించే చట్టాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శిరీష, వన్ స్టాప్ అధికారులు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

